ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
సోమవారం 8 జనవరి 2024



90 రోజుల్లో.. జగన్ సర్కార్ పతనం

- వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు అవినీతి తిమింగలాలు
- పశ్చిమలో నిలిచిన అభివృద్ధి.. టీడీపీ-జనసేన కూటమిదే గెలుపు
- అధికారంలోకి రాగానే మూడు పంటలకు సాగు నీరు
- పోలవరం ప్రాజెక్టు పూర్తి.. ఆక్వాకు రాయితీలు ఇస్తాం
- ఆచంట సభలో టీడీపీ అధినేత చంద్రబాబు



సభావేదికపై చంద్రబాబుతో పాటు టీడీపీ జిల్లా నాయకులు

భీమవరం/ఆచంట, జనవరి 7 : 'పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉభయ గోదావరి జిల్లాల్లో మూడు పంటలకు సాగు నీరందిస్తాం. ఆక్వా రంగానికి రాయితీ ఇచ్చి పూర్వ వైభవం తీసుకువస్తాం. జగన్మోహన్‌రెడ్డి వైసీపీ హయాంలో రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు తగ్గింది. రైతులు పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోయారు. టీడీపీ-జనసేన కూటమి అధికారంలోకి రాగానే ప్రతీ రైతుకు రూపాయిన్నరకే యూనిట్ విద్యుత్ అందజేస్తాం' అని టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటలో ఆదివారం టీడీపీ, జనసేన నిర్వహించిన 'రా కదలిరా' సభలో చంద్రబాబు ఉద్వేగంగా మాట్లాడారు. జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా నాయకులు, కార్యకర్తలు మహిళలు కదలి వచ్చారు. 'ప్రజల్లో మార్పు కనిపిస్తోంది. రాబోయే ఎన్నికల్లో వైసీపీ పతనం ఖాయం. 90 రోజులు కష్టపడండి. ప్రజలను చైతన్యపరచండి. టీడీపీ-జనసేన కూటమి ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లండి. విజయం మనదే' అంటూ చంద్రబాబు కార్యకర్తకు దిశా నిర్దేశం చేశారు. అధికార పార్టీ నేతలు అవినీతి తిమింగలాలు, జిల్లాల్లో మంత్రులు, ఎమ్మెల్యేల అవినీతి చక్రవర్తులు. ఆచంట ఎమ్మెల్యే రంగనాథరాజు అవినీతి తిమింగలం. ఇళ్ల స్థలాల సేకరణలో కోట్లు దోచుకున్నారు. చెరువులు తవ్వితే కమిషన్ తీసుకుంటున్నారు. భారతీయ విద్యాభవన్ సొమ్ములను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఏదో ఊహించు కుని ఎగిరిపడుతున్నాడు. టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే అన్నీ కక్కిస్తాం. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తన సొంత గ్రామంలో రైతులకు గోనె సంచులు ఇవ్వలేని ఎర్రి పప్ప. తణుకులో నిర్మాణాలు చేప డితే ఐదు శాతం కమీషన్ ఇవ్వాలి. టీడీఆర్ కుంభకోణంలో కోట్లు దోచుకుని వైసీపీ నేతలకు ఆదర్శంగా నిలిచారు. తణుకులో టీడీఆర్ కుంభకోణం చూసి రాష్ట్రమంతా టీడీఆర్ బాండ్లు ఇస్తున్నారు. తాడేపల్లిగూడెంలో మంత్రి కొట్టు సత్యనారాయణ ఉన్నారు. చిలక్కొట్టుడు సత్యనారాయణ. భవనాలు నిర్మిస్తే కమిషన్‌లు ఇవ్వాల్సిందే. ఎవరిని విడిచిపెట్టడం లేదు. కోట్లు కొల్లగొడుతున్నాడు. భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ గజ దొంగ. భూములను



చంద్రబాబుతో జనసేన ఉమ్మడి జిల్లాల కన్వీనర్ గోవిందరావు మాటా మంతీ

ఆక్రమించుకుని రూ.52 కోట్లు దోచేశారు. సీఎం జగన్ విశాఖ రుషికొండలో ప్యాలస్ మాదిరిగానే భీమవరంలోనూ గ్రంధి శ్రీనివాస్ సొంత ప్యాలెస్ నిర్మించుకుంటున్నారు. ఇక నరసాపురంలో ముదునూరి ప్రసాదరాజు ఏటిగట్టు నిర్మించి రూ.15 కోట్లు బొక్కేశాడు. తక్కువ ధరకు భూములు కొని ఎక్కువ ధరకు విక్రయించి కోట్లు గడించారు. ఇలా అవినీతికి పాల్పడుతున్న వీరందరిని తప్పించే దమ్ము జగన్‌కు ఉందా ? అంటూ చంద్రబాబు నిలదీశారు.

స్థానిక సమస్యల ప్రస్తావన

నిడదవోలు, పాలకొల్లు, తణుకుకు కావాల్సిన మంచినీటి పైపులైన్ ప్రాజెక్టు నిలిచిపోయింది. బియ్యపుతిప్ప హార్బర్ పనులు ప్రారంభం కాలేదు. ఎన్ఐటికి భూములు ఇవ్వలేదు. కాలువలు, డ్రెయిన్‌లలో పూడిక తీయలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది. రోడ్లు కూడా నిర్మించలేకపోయారు. టీడీపీ, జనసేన అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాను అభివృద్ధి చేస్తాం. అన్ని సమస్యలను పరిష్కరిస్తాం. 2014లో 15 సీట్లు ఎమ్మెల్యే ఇచ్చారు. ఇప్పుడు అదే సత్తా చాటాలి. ఉమ్మడి పశ్చిమలో 15 సీట్లు గెలిపించాలి. ప్రజల్లో మార్పు వచ్చిందనడానికి సభకు విచ్చేసిన యువతే నిదర్శం' అంటూ పేర్కొన్నారు. దాదాపు గంటసేపు చంద్రబాబు ప్రసంగం కొనసాగింది. బాబు మాట్లాడుతున్నంత సేపు జనం కదలలేదు. హర్షద్వానాలతో మద్దతు ప్రకటించారు. చంద్రబాబు చేసిన ప్రతీ విన్నపం పైన స్పందించారు. అండగా మేముంటా మంటూ కార్యకర్తలు, నాయకులు, మహిళలు జేజేలు పలికారు. సభకు మాజీ మంత్రి పితాని సత్యనారాయణ అధ్యక్షత వహించగా, సమావేశంలో పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల టీడీపీ అధ్యక్షులు తోట సీతారామలక్ష్మి, గన్ని వీరాంజనేయులు, కెఎస్ జవహర్, జనసేన అధ్యక్షుడు కొటికలపూడి గోవింద రావు, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, మంతెన రామరాజు, మాజీ మంత్రులు పీతల సుజాత, ప్రత్తిపాటి పుల్లారావు, మాజీ ఎమ్మెల్యేలు కలవపూడి శివ, ఆరిమిల్లి రాధాకృష్ణ, బూరుగుపల్లి శేషారావు, ఇన్‌చార్జిలు వలవల బాబ్జి, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీలు అంగర రామ్మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.



గుమ్మడికాయతో దిష్టి తీస్తున్న మహిళ



మహిళల ఉత్సాహం



యువకుల కేరింతలు



సభకు వస్తున్న అభిమానులు, కార్యకర్తలు



ఉప్పొంగిన ఆచంట..

ఆచంట/పెనుగొండ, జనవరి 7 : నాలుగు న్నరేళ్లలో జగన్ ప్రభుత్వం సాగించిన అరాచకాలను ఎండగట్టారు. జిల్లాలో మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమాలను వివరించారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ.. వస్తే ఏం చేస్తామో విశదీకరిస్తూ.. సాగింది.. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడి ప్రసంగం.ఆచంటలో ఆదివారం జరిగిన రా.. కదలిరా.. బహిరంగ సభ జనంతో కిక్కిరిసింది. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల నుంచి వచ్చిన జనంతో ఆచంట కిక్కిరిసింది. సభకు అశేషంగా జనం రావడంతో తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం నెలకొంది. టీడీపీ, జనసేన యువకులు ప్లెక్సీలు, జెండాలతో కేరింతలు కొట్టారు. సభ రెండున్నర గంటలపాటు జరగ్గా వచ్చిన జనం సభ పూర్తయ్యే వరకు అలాగే ఉండిపోయారు. హెలిప్యాడ్ నుంచి సభా వేదిక వద్దకు వచ్చే మధ్యలో చంద్రబాబు ప్రసిద్ధి చెందిన ఆచంటేశ్వ రుడిని దర్శించుకున్నారు. రాష్ట్రానికి స్వర్ణయుగం వచ్చి, ప్రజలకు మంచి చేసే శక్తిని తనకు ఇవ్వాలని కోరుకున్నట్లు చంద్రబాబు చెప్పారు. ఆలయం వద్ద టీడీపీ నాయకుడు బోడపాటి దుర్గాప్రసాద్ ఏర్పాటుచేసిన కమలా ఫలాలు దండతో స్వాగతం పలికారు. సభా వేదికపై జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్‌బాబు గజమాలతో సత్కరించారు.

పర్యటన సాగిందిలా..

చంద్రబాబు తిరువూరు నుంచి సాయంత్రం 4.05 గంటలకు ఆచంట హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. 4.50 గంటలకు ఆచంటేశ్వరుని దర్శించుకున్నారు. 5.20కు సభా స్థలికి చేరుకున్నారు. 5.35కు బాబు ప్రసంగం ప్రారంభించి 6.30కు ముగించారు. అనంతరం రోడ్డు మార్గంలో రాజమండ్రి ఎయిర్ పోర్టుకు బయలుదేరి వెళ్లారు. ఆచంటలో 2.30 గంటలపాటు చంద్రబాబు సాగింది.

నేలకొచ్చిన హరివిల్లు

సందడిగా ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు



తాడేపల్లిగూడెం రూరల్/ పెంటపాడు జనవరి 7: సంప్రదాయ శోభ మేళవించిన రంగవల్లులతో తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి లోటస్ హైస్కూల్‌లో తెలుగు వారి పండుగ సంక్రాంతి ముందుగానే సందడి చేసింది. ఆదివారం జరిగిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని ప్రతీ ఏటా "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంకు ముత్యాల ముగ్గుల పోటీలు.. పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు..ద రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" సారధ్యంలో ఆదివారం పెదతాడేపల్లి లోటస్ హైస్కూల్‌లో జనసేన తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌చార్జ్, లోటస్ స్కూల్ ఫౌండర్ ఛైర్మన్ బొలిశెట్టి శ్రీనివాస్ సౌజన్యంతో ఘనంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 47 మంది మహిళలు పాల్గొన్నారు. బొలిశెట్టి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ హిందువులకు ఎంతో ముఖ్యమైన పండగ అని ప్రతీ ఏటా రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్కూల్ ఛైర్మన్ బొలిశెట్టి రాజేష్ మాట్లాడుతూ సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహణలో తమకు భాగ స్వామ్యం ఇవ్వడం ఆనందంగా ఉందని ప్రతీఏటా తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో పోటీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు, ఎడిషన్ ఇన్‌చార్ డి.రామకృష్ణ, యాడ్స్ మేనేజర్ రాజు, బ్యూరో ఇన్‌చార్జ్ కిషోర్, జనసేన పట్టణ అధ్యక్షుడు వర్తనపల్లి కాశీ, హైకోర్టు న్యాయవాది సోమరాజు, స్కూల్ ప్రిన్సిపాల్ ఉమా శ్రీనివాస్, సిబ్బంది రవికిరణ్, సతీష్, గంగాధర్, జయకృష్ణ, పి.సతీష్, కృష్ణమూర్తి, ఉదయ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.







ముగ్గులు పెడుతున్న మహిళలు



ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు

మొదటి బహుమతి



ఆంధ్రజ్యోతి నిర్వహిస్తున్న పోటీల్లో నేను ప్రతి ఏటా పాల్గొంటాను. కానీ గతంలో ద్వితీయ, తృతీయ స్థానాలు వచ్చాయి. ఈ ఏడాది మొదటి బహుమతి రావడం ఆనందంగా ఉంది.



మొదటి బహుమతి విజేత భార్గవికి నగదు బహుమతి అందిస్తున్న బొలిశెట్టి శ్రీనివాస్ సతీమణి

విజేతలకు బహుమతులు

ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటి స్థానంలో నిలిచిన కె.వేణుభార్గవి (భీమవరం) రూ.6 వేలు నగదు బహుమతి, రెండో బహుమతి పి.పావని (నగిడిపాలెం) రూ.4 వేలు, మూడో బహుమతి జి.అమ్మాజి (నరసాపురం) రూ.3 వేలు అందుకున్నారు. విజేతలకు లోటస్ స్కూల్ ఛైర్మన్ బొలిశెట్టి రాజేష్, ఆయన సతీమణి బొలిశెట్టి దేవీప్రియ, బొలిశెట్టి శ్రీనివాస్ సతీమణి అనురాధ నగదు బహుమతులు అందించారు.న్యాయ నిర్ణేతలుగా అనురాధ, దేవీప్రియ, కె.ధనలక్ష్మిలు వ్యవహ రించారు. మరో 10 మందికి కన్సొలేషన్ బహుమతులతో పాటు పాల్గొన్న ప్రతీ ఒక్కరికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

రెండో బహుమతి



ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలంటే ఇష్టం. కానీ ఎప్పుడూ మిస్ అయ్యేదాన్ని. ఈసారి ఓ యూ ట్యూబర్ సాయంతో పోటీల్లో పాల్గొన్నా. బహుమతి రావడం చాలా ఆనందంగా ఉంది.



రెండో బహుమతి విజేత పావనికి నగదు బహుమతి అందిస్తున్న లోటస్ స్కూల్ ఛైర్మన్ బొలిశెట్టి రాజేష్

మూడో బహుమతి



నాకు రెండు రోజుల నుంచి ఆరోగ్యం బాగోలేదు. కానీ ఏటా పోటీల్లో ఆనవాయితీగా పాల్గొంటున్నాను. ఈ సారి కూడా పోటీలకు హాజరై బహుమతి అందుకోవడం చాలా ఆనందంగా ఉంది.



మూడో బహుమతి విజేత అమ్మాజీకి నగదు బహుమతి అందిస్తున్న బొలిశెట్టి రాజేష్ సతీమణి దేవీప్రియ

వైభవంగా అమ్మవార్ల జాతర



వీరవాసరం, జనవరి 7: పంజావేమవరం గ్రామ దేవతల జాతర వైభవంగా నిర్వహించారు. 11 రోజులపాటు నిర్వహించే ఈ జాతర మహోత్సవంలో శనివారం రాత్రి దేవగిరి సత్తెమ్మ, పద్దాల వెంకమ్మ జాతరలను గ్రామస్తులు విశేషంగా ఆలయాల వద్ద నిర్వహించారు. ఆదివారం అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు. ఆదివారం గ్రామంలో పండుగ వాతావారణం నెలకొంది. బంధుమిత్రులు రాకతో గ్రామంలో ప్రతీ ఇంట కోలాహలం నెలకొంది.

ఘనంగా నాగాలమ్మ జాతర



నరసాపురం టౌన్, జనవరి 7: పట్టణంలోని చినమామిడిపల్లిలో నాగాలమ్మ జాతర ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏకాదశిని పురస్కరించుకుని అమ్మవారి గ్రామోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో మధ్యాహ్నం వరకు భక్తుల రద్దీ తగ్గలేదు.

రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు

నరసాపురం రూరల్, జనవరి 7: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు ఏవో డాక్టర్ శేఖర్ తెలిపారు. సుమారు 230 టన్నుల యూరియా, పొటాష్ వంటి రకాల ఎరువులు ఉన్నాయన్నారు. కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద తీసుకోవాలని సూచించారు.

టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మణికంఠ



భీమవరం టౌన్, జనవరి 7 : జిల్లా భారతీయ జనతా యువమోర్చా ప్రధాన కార్యదర్శి అరసవల్లి మణికంఠ వెంకటేష్‌ను బీఎస్ఎన్ఎల్ అడ్వైజరీ కమిటీ సభ్యునిగా నియమించారు. ఈ నియామక పత్రాన్ని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి భూపతి రాజు శ్రీనివాస వర్మ చేతుల మీదుగా అందుకున్నారు.

మంచినీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం

మొగల్తూరు, జనవరి 7: నరసాపురం నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేస్తున్నట్టు ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. ఆదివారం ముత్యాలపల్లిలో రూ.63లక్షలతో నిర్మించే పైప్‌లైన్ విస్తరణ పనులకు, ఓహెచ్ఆర్ నిర్మాణాలకు ఆయన భూమి పూజ చేశారు. జలజీవన్ మిషన్ ద్వారా నియోజకవర్గంలో రూ.43లక్షలతో కొత్తపైప్‌లైన్‌లు నిర్మిస్తున్నామనారు. కార్యక్రమంలో సర్పంచ్ కొపనాతి పల్లయ్య, జడ్పీటీసీ తిరుమాని బాపూజీ, కొత్తోట సర్పంచ్ పడవల సత్యనారాయణ పాల్గొన్నారు.

20న ఉచిత వైద్య శిబిరం

మొగల్తూరు, జనవరి 7: కేంద్ర మాజీ మంత్రి, రెబల్‌స్టార్ దివంగత యువి కృష్ణంరాజు జయంతిని పురస్కరించుకుని ఈనెల 20న మొగల్తూరులో ఉచిత మెగా షుగర్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు భీమవరం ఇంపీరియల్ ఆసుపత్రి వైద్యులు రాయసం నరేష్ తెలిపారు. ఆదివారం మొగల్తూరు అబ్బాస్ కళాశాలలో గ్రామీణ వైద్యులకు అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు, జనవరి 7: సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా సంచార శకటం ద్వారా వైద్య సేవలను అందిస్తున్న విషయం విదితమే. ఆదివారం ప్రముఖ నేత్ర వైద్యులు డా. హుస్సేన్ అహ్మద్ తణుకు, కొండాలమ్మ పుంత రోడ్డు, ఇరగవరం కాలనీ ప్రాంతాల్లో పర్యటించి 12 మంది వృద్ధులకు వైద్య సేవలందించి సంఘ సభ్యుడు కాశీ విశ్వనాథం ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందించారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, కోశాధికారి అర్జి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

బైరాగి మఠంలో ప్రత్యేక పూజలు



పెంటపాడు, జనవరి 7: కే.పెంటపాడు బైరాగిమఠం గోపాల స్వామి అంజనేయ స్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా ఆలయ ఫిట్‌పర్సన్ రవిశంకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వెంకట్రామన్నగూడెం వైఎస్ఆర్ హార్టికల్చర్ వర్సిటీ ఈఈ మేకల చిరంజీవులు తిరుపావై పారాయణం చేశారు. అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణచంద్ర త్రిపాఠి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు త్రిలోచన దాస్, పూర్ణ చంద్ర త్రిపాఠి ప్రత్యేక పూజలు చేశారు.

13 నుంచి మావుళ్ళమ్మ ఉత్సవాలు

భీమవరం టౌన్, జనవరి 7 : ఈనెల 13 నుంచి జరిగే మావుళ్ళమ్మ 60 వార్షిక మహోత్సవాలను పురస్కరించుకుని అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆదేశించారు. ఆలయం వద్ద ఆర్డీవో శ్రీనివాసులరాజు అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమన్వయ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మెడికల్ క్యాంపు ఏర్పాటు చెయ్యాలని, పోలీస్ పికెట్ ఏర్పాటు చెయ్యాలని సూచించారు. సమావేశంలో ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ మానేపల్లి నాగన్నబాబు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు రామాయణం గోవిందరావు, డీఎస్పీ శ్రీనాథ్ పాల్గొన్నారు.

మావుళ్ళమ్మకు వెండి గరగ బహూకరణ



మావుళ్ళమ్మకు సినీనటుడు కళ్యాణ్‌రామ్ తరుపున వెండి గరగ బహూకరణ

భీమవరం టౌన్, జనవరి 7 : మావుళ్ళమ్మకు సినీ నటుడు నందమూరి కళ్యాణ్‌రామ్ వెండి గరగను బహూకరించారని ఆలయ సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజీ తెలిపారు. మూడు కేజీల 342 గ్రాముల బరువు ఉన్న గరగను ఆయన తరుపున జగన్నపేటకు చెందిన సిద్ధాంతి కారుపర్తి కోటేశ్వరరావు అందించారని తెలిపారు.









భీమవరం నుంచి బయలుదేరిన టీడీపీ నాయకులు... కాళ్ళలో జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంతెన.. ఆచంటలో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న మాజీ ఎమ్మెల్యేలు ఆరిమిల్లి, పితాని, ఎమ్మెల్యే నిమ్మల.. నరసాపురంలో కొవ్వలి నాయుడు, పొత్తూరి రామరాజు బైక్ ర్యాలీ

చంద్రబాబు సభకు తరలిన టీడీపీ శ్రేణులు



ఉండి నుంచి బయలు దేరిన టీడీపీ నాయకులు

భీమవరం అర్బన్/భీమవరం రూరల్/ఆకివీడు/ఉండి/నరసాపురం టౌన్/తణుకు/కాళ్ళ/పాలకోడేరు/తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 7: ఆచంటలో నిర్వహించిన చంద్రబాబు రా కదలిరా మహాసభకు భీమవరం నుంచి వేలాది మంది తరలి వెళ్లారు. జిల్లా పార్టీ అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి, సీనియర్ నాయకులు మెంటే పార్థసారథి నాయకత్వంతో బస్సులు, కారులు, బైకుల్లో కార్యకర్తలు తరలి వెళ్ళారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్ నుంచి నిర్వహించిన కార్ల ర్యాలీని మాజీ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ బీసీ సాధికారిత కమిటీ డైరెక్టర్, కృష్ణబలిజ సేవా సమితి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గంటా త్రిమూర్తులు కాలికి గాయం కావడంతో తను సమకూర్చిన వాహనాల్లో కార్యకర్తలను పంపించారు. ఆకివీడు నుంచి టీడీపీ మండల-పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలి వెళ్ళారు. ఉండి నుంచి పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి పొత్తూరి వెంకటేశ్వరరాజు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కిస్నెర వెంకన్న, జుత్తుగ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు తరలి వెళ్ళారు. నరసాపురంలో ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు, కొవ్వలి నాయుడు ఆధ్వర్యంలో సుమారు 3వేల మంది ర్యాలీగా ఆచంట బయలుదేరి వెళ్లారు. తణుకులో మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు పలు వాహనాల్లో ర్యాలీగా తరలివెళ్లారు. కాళ్ళ మండలం నుంచి సుమారు 500 మంది కార్యకర్తలు నాయకులు బస్సులు, కార్లు, మోటార్ బైక్‌లుపై ఆచంట తరలి వెళ్ళినట్లు పార్టీ మండల అధ్యక్షుడు జీవీ నాగేశ్వరరావు తెలిపారు. ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు పెదఅమిరంలో ఎన్టీయార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం బస్సులకు జెండా ఊపి ప్రారంభించారు. పాలకోడేరు మండలం నుంచి మండల టీడీపీ అధ్యక్షుడు దెందుకూరి ఠాగూర్ కోటేశ్వరరాజు ఆధ్వర్యంలో బస్సులు, కారులు, బైక్‌లతో పెద్ద ఎత్తున తరలివెళ్ళారు. ఈసందర్భంగా పాలకోడేరులో బైక్ ర్యాలీని ఎమ్మెల్యే రామరాజు ప్రారంభించారు. తాడేపల్లిగూడెం నుంచి టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభకు బాబ్జి ఆధ్వర్యంలో బస్సులు, కార్లు, మోటార్‌సైకిళ్లపై పార్టీ శ్రేణులు భారీగా తరలి వెళ్ళాయి. ర్యాలీని బాబ్జి జెండా ఊపి ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి గొర్రెల శ్రీధర్, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, పరిమి రవికుమార్, గంధం సతీష్, పాతూరి రాంప్రసాద్‌చౌదరి, బండి పెద్దిరాజు పాల్గొన్నారు.



చంద్రబాబును సత్కరిస్తున్న వలవల బాబ్జి

రోడ్డు పొడవునా పూలవర్షం కురిపించిన ప్రజలు

పోడూరు/ ఆచంట, జనవరి 7: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హెలీప్యాడ్‌లో సాయంత్రం 4గంటల 5నిమిషాలకు ల్యాండ్ అయ్యారు. చంద్రబాబును చూసేందుకు హెలీప్యాడ్ వద్దకు జనం భారీగా చేరుకున్నారు. హెలీప్యాడ్ దిగిన వెంటనే చంద్రబాబు అక్కడ ఉన్న జనానికి చేతులు జోడించి అభివాదం చేశారు. చంద్రబాబుకు పార్టీ నాయకులు స్వాగతం పలికారు. హెలీప్యాడ్ వద్ద నుంచి సభాప్రాంగణానికి వెళ్లేందుకు వాహనాలను పోలీసు యంత్రాంగం సిద్ధంగా ఉంచారు. చంద్రబాబు బస్సు లోపలికి వెళ్లారు. అనంతరం పితాని సత్యనారాయణ, సీతారామలక్ష్మి, బుచ్చయ్యచౌదరి, రామానాయుడులతో సుమారు 25 నిమిషాల పాటు చంద్రబాబు మాట్లాడారు. అనంతరం చంద్రబాబు కాన్వాయ్‌లో ప్రజలకు అభివాదం చేస్తూ సభాప్రాంగణానికి బయలుదేరి వెళ్లారు. రోడ్డు పొడవునా చంద్రబాబుకు మహిళలు, యువత, ప్రజలు పెద్దఎత్తున చేరుకుని పూలవర్షం కురిపించారు.







పాలకోడేరులో ఎస్మా కాపీలతో పడవలు తయారు చేసి చెరువులోకి వదులుతున్న అంగన్‌వాడీలు.. ఆకివీడు.. గణపవరంలలో జీవో ప్రతుల దహనం

ఎస్మా ప్రతుల దహనం

జిల్లాలో కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

భీమవరం అర్బన్/ఆకివీడు/మొగల్తూరు/గణపవరం/ తణుకు/వీరవాసరం/పాలకోడేరు/పెంటపాడు/ఇరగవరం, జనవరి 7: అంగన్వాడీల సమ్మె విరమించాలని ప్రభుత్వం తీసుకొచ్చిన ఎస్మా ప్రతులను అంగన్‌వాడీలు భీమవరంలో దహనం చేశారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షులు జెఎన్వీ గోపాలన్, టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి మద్దతు తెలిపారు. పాలకోడేరులో అంగన్‌వాడీలు ఎస్మా కాపీలను పడవలు మాదిరిగా తయారు చేసి గ్రామంలో ఊరేగిన అనంతరం గ్రామంలోని పశువుల చెరువులో వదిలి గంగార్పణం చేశారు. ఆకివీడు, మొగల్తూరు, గణపవరం, తణుకు, వీరవాసరం, పెంటపాడు, ఇరగవరంలలో ఎస్మా ప్రతులను దహనం చేశారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు: ఎస్పీ



భీమవరం క్రైం, జనవరి 7 : కోడిపందేలు, పేకాట నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ యూపీ రవిప్రకాశ్ హెచ్చరించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ముఖ్య ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలైన కోడిపందేలు, జూదం వంటి వాటి వలన అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. దీని వలన వారి కుటుంబల జీవన విధానం అస్తవ్యస్తం అయ్యే అవకాశం ఉందన్నారు. అందువల్ల జిల్లాలో కోడిపందేలు, జూదం నిర్వహించకుండా గతంలో వీటిని నిర్వహిస్తూ, ఆడుతూ పట్టుబడినవారు మరల వాటి జోలికి వెళ్ళకుండా బైండోవర్ చెయ్యడం జరుగుతుందన్నారు. గతంలో కోడిపందేలు, పేకాట నిర్వహించిన ప్రదేశాలపై, నిర్వాహకులపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు.

జిల్లాలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత పోలీస్‌స్టేషన్‌కి లేదా డయల్ 100, 112 లేదా జిల్లా కంట్రోల్ రూమ్ 91549 65935 నెంబర్‌లకి ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయన్నారు.

సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి: డీఈవో

భీమవరం రూరల్, జనవరి 7: సైన్స్ ప్రోత్సహించండి.. సైన్స్‌తోనే సమాజం అభివృద్ధి చెందుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.వెంకటరమణ ఉపాధ్యాయులను కోరారు. విష్ణు స్కూల్లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు బహుమతి ప్రదానోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలో జనవిజ్ఞాన వేదిక సైన్స్ పోటీలను నిర్వహించడం సైన్స్ ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. ఉప విద్యాశాఖాధికారి శ్రీరామ్, కోశాధికారి మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ 250 స్కూల్స్‌కి సంబంధించి 14000 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. పొత్తూరి బాపిరాజు,గౌరవ అధ్యక్షులు డా.కెపిఎస్ఎన్ వర్మ పతాకావిష్కరణ చేశారు.

పోటీలలో జిల్లా విజేతలు

జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 34 టీమ్స్‌లో ప్రథమ స్థానంలో రెండు టీమ్స్ నిలిచాయి. యలమంచిలి మండలం మట్లపాలెం ఉన్నత పాఠశాల విద్యార్థులు జి.మాధురి దీక్ష, ఏఆర్ లక్ష్మీ, జి మీనాక్షిలు, పాలకొల్లు భారతీయ విద్యా భవన్‌కి చెందిన జి.తేజస్వి, ఎం తన్మయ్య, ఆర్.రిషిత విజేతలుగా నిలిచారు. విజయం సాధించిన ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ సంబరాలకు ఎంపికయ్యారు. ఫిబ్రవరి 10, 11 తేదీలలో పల్నాడులోని చిలకలూరి పేటలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారు. కార్యక్రమంలో అధ్యక్షులు చింతపల్లి ప్రసాద్, విష్ణు పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.సత్యమూర్తి, టి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



చెకుముకి పోటీల విజేతలతో డీఈవో, నిర్వాహకులు

కోడిపందేలు, జూదం నేరం

వీరవాసరం, జనవరి 7: సంక్రాంతి పండుగ సీజన్‌లో కోడిపందాలు, జూదం నిర్వహించటం , అక్రమ మద్యం అమ్మకాలు నేరంగా పరిగణిస్తామని తహసీల్దార్ ఎం.సుందరరాజు పేర్కొన్నారు. జనవరి నెల అంతా గ్రామాల్లోని వ్యవసాయక్షేత్రాలు గ్రామ కంఠం భూములు, వనాలు, జనావాసు ప్రాంతాలందు కోడిపందేల నిర్వహణ కోసం బరులు ఏర్పాటు చేయటం నిషేధించామని తెలిపారు. ఈ నిబంధనలను ఎవరైనా అతిక్రమిస్తే చట్టరీత్య చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతులకు ప్రోత్సాహక బహుమతులు



పెనుగొండ, జనవరి 7: వడలి గ్రామంలో పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్ సెంటర్ వద్ద విశాఖ డెయిరి జిల్లా కార్యనిర్వహణాధికారి బి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆచంట ఏరియా పర్యవేక్షణాధికారి కె. పరమేశ్వరరావు 60 మంది పాడి రైతులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో పశు వైద్య సహాయకులు పి. సత్యనారాయణ, సంస్థ అధ్యక్షుడు యు.రామారావు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి: కలెక్టర్



భీమవరం,జనవరి 7: జిల్లాలో 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి విజ్ఞప్తి చేశారు. ఓటు అనేది మన అందరి హక్కుఅని, ఓటరుగా నమోదుకావాలని ఆదివారంనాడు ఒక ప్రకటనలో సూచించారు. ఉన్నత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ఓటు అవకాశాన్ని పొందాలన్నారు. ఓటు నమోదుకు సమయం ముగుస్తోందన్నారు. అర్హతకలి గినవారంతా ఓటుకోసం ఆన్‌లైన్ లేక ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు అందజేసి నమోదు చేసుకోవచ్చునని కలెక్టరు పేర్కొన్నారు.

ధ్యానంతో నాడీ మండల శుద్ధి

వీరవాసరం, జనవరి 8: ధ్యానం మనిషిని ఆలోచన రహిత స్థితికి చేరుస్తుందని దీని వలన విశ్వమయ ప్రాణశక్తిని పొందటం ద్వారా నాడీమండల శుద్ధి జరుగుతుందని రాజమండ్రికి చెందిన సీనియర్ పిరమిడ్ మాస్టర్ కె విజయదుర్గ అన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత పొందవచ్చునన్నారు. ఆదివారం వీరవాసరం మార్కెట్ ఏరియాలోని వినాయక ఆలయ ప్రాంగణంలో పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఉచిత ధ్యాన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించింది. పత్రీజీ ప్రబోధించిన శ్వాసమీద ధ్యాస, స్పిరిచ్యువల్ ట్యాబ్‌లెట్స్‌కు సంబందించి ట్రాఫిక్ సిగ్నల్స్‌కు సంబంధించిన పది అంశాలను వివరించారు. సామూహిక ధ్యానం చేయించారు. జిల్లా కో ఆర్డినేటర్ కెవిడి ప్రసాద్ , తీడ నాగరాజు, బి శ్రీదేవి, ఆదిరెడ్డి పద్మ పాల్గొన్నారు.

దర్శిపర్రులో అక్షింతల పంపిణీ

పెంటపాడు, జనవరి 7: అయోధ్య రామమందిర అక్షింతలను ఆదివారం దర్శిపర్రులో సుమారు 100 మంది మహిళలు గ్రామంలో ఇంటింటికి వెళ్ళి అందజేశారు. సర్పంచ్ కోలా శేషవేణి, ఉప సర్పంచ్ కోలా మార్కండేయులు, ఎంపీటీసీ తోట నిరీక్షణరావు, గుండుమోగుల మునీంద్ర, సుంకర గంగరాజు, బోడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జనసేనలో చేరిక

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 7 : అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అండగా ఉండటమే జనసేన లక్ష్యమని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. కొండ్రుప్రోలులో ఆదివారం రాత్రి నాయకులు తోట గోపి, పైబోయిన వెంకటరామయ్య పైబోయిన రఘు ఆధ్వర్యంలో పలువురు జనసేనలో చేరారు.

ఈవీఎంలపై అవగాహన

భీమవరం టౌన్, జనవరి 7: ప్రతిఒక్కరు ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలని ఆర్డీవో శ్రీనివాసులు రాజు అన్నారు. భీమవరం తబితా వృద్ధ ఆశ్రమంలో రెవెన్యూ శాఖ, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఈవీఎంలతో ఓటు హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలి అనే విషయమై అవగాహన కల్పించారు. ఓటు వేసే విధానాన్ని స్వయంగా డెమో ద్వారా వివరించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్‌లు ఉంటాయని తహసీల్దార్ రవికుమార్ వివరించారు. ఓటు వేసే విధానం తెలిపారు.



మునిసిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న కార్మికులు

13వ రోజుకు మునిసిపల్ కార్మికుల సమ్మె

భీమవరం టౌన్, జనవరి 7 : మున్సిపల్ కార్మికుల సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరుకున్నది. మునిసిపల్ కార్యాలయం వద్ద అన్ని కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో కార్మికులు పాల్గొని నినదించారు. ఏఐటీయూసీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ భీమవరం పట్టణ కార్యదర్శి చెల్లబోయిన రంగారావు, సీఐటీయూ నుంచి వాసుదేవరావు మాట్లాడుతూ, వర్కర్స్ న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించాలని అన్నారు.

కన్సొలేషన్ బహుమతుల అందజేత









ముగ్గులు తిలకిస్తున్న అతిథులు.. ఆంధ్రజ్యోతి సిబ్బంది... ముగ్గులు వేస్తున్న మహిళలు

ముత్యాల ముగ్గులు

తాడేపల్లిగూడెం రూరల్, జనవరి 7: పెదతాడేపల్లిలో ఏబీఎన్-ఆంధ్రజ్యోతి నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలకు భారీగా మహిళలు తరలి వచ్చారు. మహిళలు వేసిన ముగ్గులు సంక్రాంతి శోభను తెచ్చాయి. ముందే సంక్రాంతి పండుగ వచ్చిందన్న రీతిలో సాంప్రదాయబద్ధంగా నిర్వహించిన పలు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మొదటి ముగ్గురు విజేతలతోపాటు మరో 10 మందికి కన్సొలేషన్ బహుమతులు అందించారు. వి.సంధ్య, డి.జ్యోతి, ఎం. లక్ష్మీ, కె.స్రవంతి, ఎ. కనకదుర్గ, టి. ప్రసన్న, డి. ఝాన్సీరాణి, ఎన్. తేజశ్రీ, యు. వసుంధరాదేవి, ఎం.సునీత బహుమతులు అందుకున్నారు. వీరితో పాటు పోటీలో పాల్గొన్న ప్రతి మహిళకు ప్రోత్సాహక బహుమతులు అందించారు.



















టీడీపీ జెండాలతో పార్టీ శ్రేణుల ఉత్సాహం

మాజీ మంత్రి పీతల, జవహర్



ఆచంట రా..కదలి రా.. సభలో మాట్లాడుతున్న మాజీ సీఎం చంద్రబాబునాయుడు (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న మాజీ మంత్రి పితాని సత్యనారాయణ



హెలీప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం అందిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అంగర



బామ్మ అభివాదం

అవినీతి మహారాజు సీఎం జగన్



చంద్రబాబుకు కమలాల దండ వేస్తున్న పార్టీశ్రేణులు

ఆచంట, జనవరి 7: రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియాతో ఈ రాష్ట్ర సీఎం జగన్ అవినీతి మహారాజుగా తయారయ్యాడని మాజీ మంత్రి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ విమర్శించారు. ఆదివారం ఆచంటలో జరిగిన రా కదలి రా.. సభలో ఆయన మాట్లాడుతూ జగన్ అరాచక హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నాడని, ప్రశ్నించిన వారిపై కేసులు పెడుతున్నాడరన్నారు. ఇవి అంతమొందించాలంటే టీడీపీ, జనసేన కలిసి అధికారంలోకి రావాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. జగన్‌ను ఇంటికి పంపడానికే టీడీపీ అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలో 'రా.. కదలి రా..' సభలు జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో టీడీపీ అధికారంలోకి రాగానే అయోధ్యలంక బ్రిడ్జి, నియోజకవర్గ ప్రజలకు ఇళ్ల స్థలాలు ఇంకా అనేక సమస్యలు తీర్చాలని పితాని చంద్రబాబు నాయుడిని సభలో అడిగారు.

జగన్‌ను ఇంటికి పంపడానికే
రా.. కదలి రా.. సభలు

ఆచంట ఎమ్మెల్యే అవినీతిపరుడు..

నియోజకవర్గ ఎమ్మెల్యే రంగనాథరాజు ఒక అవినీతిపరుడని ఇళ్ల పట్టాలు ఇచ్చే సమయంలో లక్షల రూపాయలు ప్రజల వద్ద వసూలు చేశారని పితాని విమర్శించారు. పట్టాల పేరుతో సుమారు రూ.25కోట్లు దోచుకున్నారని విమర్శించారు. ఆచంట మాజీ మంత్రి ఒక సన్యాసి, ఈ సభా వేదికను అడ్డుకున్నారు. వేదిక ఇచ్చినవారిని బెదిరించారు. మూడు రోజులపాటు ఆపారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విజిలెన్స్ అధికారులను పంపించారు. తాను వారికి సవాల్ విసిరాను చూస్తాం భయ పడేదిలేదు. భయపడే సభను అడ్డుకున్నారని అన్నారు. పైగా తనకు సంబధంలేదని చెప్పడం సన్నాసి వ్యవహారంగా పేర్కొన్నారు. మార్వాడీ అతిథిగృహాన్ని అడ్డుకున్నారు. ఎదురు తిరిగాం చివరికి అంగీకరించి ఇచ్చారు. ఇక్కడ అంతా అవినీతిమయంగా మారింది. రైతుల నుంచి, రైస్ మిల్లర్స్‌నుంచి ఏటా 12 నుంచి రూ.13 కోట్లు దండుకుంటున్నారని విమర్శించారు. భారతీయ విద్యాభవన్స్‌కు సంబంధించి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్‌కు తెలియకుండా చనిపోయిన వారిపేరును తప్పుడు అఫిడవి ట్లను ఇచ్చి తప్పించిన దుర్మార్గుడు అని ధ్వజమెత్తారు. ప్రజలపై, టీడీపీ వారిపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయించారు. అవన్నీ చూస్తున్నాం, తేల్చుకుంటాం అన్నారు.

- టీడీపీకి అధికారం వచ్చిన వెంటనే అయోధ్యలంక బ్రిడ్జి, ఇళ్ల పట్టాలు
- మాజీ మంత్రి పితాని సత్యనారాయణ



ఆచంట సభ వద్ద యువత కేరింతలు


మళ్లీ బాబు రావాలి



నాలుగున్నరేళ్లుగా వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. మొన్నటి తుపాన్‌కు వరి రైతులు దెబ్బతిన్నారు. ఆక్వా రైతులకు తీవ్ర నష్టాలు వచ్చాయి. ఈ పరిస్థితులన్నీ చక్కదిద్దాలంటే మళ్లీ చంద్రబాబు రావాలి

- తోట సీతారామలక్ష్మి
టీడీపీ పశ్చిమ గోదావరి అధ్యక్షురాలు


34 స్థానాలూ మనవే



జగన్ ప్రభుత్వం వచ్చాక అన్నింటి ధరలు పెంచేశారు. రైతులకు మద్దతు ధర లేదు. నిత్యావసరాలు, పెట్రోల్, విద్యుత్ చార్జీలు మొదలైన వాటిపై బాదుడే బాదుడు. జగన్ పని అయిపోయింది. వచ్చే ఎన్నికల్లో ఉభయ గోదావరి జిల్లాలోని 34 అసెంబ్లీ స్థానాలు గెలుస్తాం. టీడీపీ, జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం.

- నిమ్మల రామానాయుడు, పాలకొల్లు ఎమ్మెల్యే

దుష్టపాలన అంతమొందించాలి



జగన్ దుష్ట పరిపాలనను అంతమొందించేందుకు రాబోయే రోజుల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడుతుంది. మన జిల్లాలో పోలవరం ప్రాజెక్టు, రైతుల కష్టాలు పట్టించుకోలేదు. పరిపాలన భ్రష్టు పట్టింది. లంచాలు పెరిగిపోయాయి. దౌర్జన్యాలు సాగుతున్నాయి. అందరం కలిసి ఈ పాలన అంతం చేయాలి.

- వలవల బాబ్జి, తాడేపల్లిగూడెం టీడీపీ ఇన్‌చార్జి

మహిళలపై దాడులు జరుగుతున్నాయి



ఈ రాష్ట్రంలో మహిళా కమిషన్ పనిచేయడం లేదు. నాలుగున్నరేళ్లలో రెండు లక్షల 47 వేల మంది మహిళలపై దాడులు జరిగాయి. అత్యాచారాలు, హత్యలు దారుణాలు జరుగుతున్నా ఒక్క కేసు నమోదు చేయలేదు. నేను మహిళా కమిషన్ సభ్యులుగా పని చేశా. ఇలాంటి దారుణం చూడలేదు.

- శిరిగినీడి రాజ్యలక్ష్మి, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు

ఉమ్మడి ప్రభుత్వం రావాలి



బటన్ నొక్కుడు సీఎంను ఇంటికి పంపించాలంటే రాబోయే రోజుల్లో మనం తెలుగుదేశం-జనసేన ఉమ్మడి ప్రభుత్వం స్థాపించడానికి ఈవీఎం బటన్ నొక్కాలి. ప్రజలందరూ దీనిని చేపట్టినపుడే ప్రభుత్వాన్ని సాగనంపగలం.

- కొటికలపూడి గోవిందరావు, జనసేన జిల్లా అధ్యక్షుడు

మరో వంద రోజులు భరించాలి



జగన్ ప్రభుత్వంలో దళితులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు రక్షణ లేదు. శిరోముండనం నుంచి హత్యలు, మృతదేహాల డోర్ డెలివరీ వరకు ఎన్నో దారుణాలు, దాడులు జరుగుతున్నాయి. మరో వంద రోజులపాటు ఈ ప్రభుత్వాన్ని భరించాల్సిందే.

- మాజీ మంత్రి కేఎస్ జవహర్
తూర్పు గోదావరి టీడీపీ అధ్యక్షుడు

రైతుల పరిస్థితి దారుణం



అన్నపూర్ణగా పిలుచుకుని జిల్లాలో రైతుల పరిస్థితి దారుణం. కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకునే స్థితిలో లేరు. తేమ శాతం పేరుతో అష్టకష్టాలు పడుతున్నారు. ఆక్వా రంగ పరిస్థితి దారుణంగా తయారైంది. వీటి పరిష్కారానికి చంద్రబాబు మళ్లీ రావాలి..

- మంతెన రామరాజు
ఉండి ఎమ్మెల్యే

అరాచక, అసమర్థ పాలన



రాష్ట్రంలో అరాచక, అసమర్థ, అవినీతి ప్రభుత్వం పాలన సాగిస్తోంది. దీనిని అంతమొందించాలి. ఇదేమి అని ప్రశ్నిస్తే ప్రతిపక్షాలపై అక్రమ కేసులు, దాడులు, దౌర్జన్యాలు చేస్తున్నారు. మద్యం, ఇసుకలో దారుణమైన దోపిడీ చేస్తున్నారు. దీనిని అరికట్టాలంటే చంద్రబాబు రావాలి.

- ఆరిమిల్లి రాధాకృష్ణ, తణుకు టీడీపీ ఇన్‌చార్జి

రాష్ట్రం నాశనం కాకూడదనే..



జగన్ పాలనలో జనంపై దౌర్జన్యాలు పెరిగాయి. నర్సీపట్నంలో డాక్టర్‌పై దాడి నుంచి డ్రైవర్ సుబ్రహ్మణ్యం డెడ్ బాడీ పార్సిల్ వరకు ఎన్నో అకృత్యాలు కనిపించాయి. ఇక రోడ్ల అధ్వానంపై ఎంత చెప్పుకున్నా తక్కువే. 'పోలవరం'ఆగిపోయింది. రాష్ట్రం నాశనం కాకూడదనే చంద్రబాబు, పవన్ కలిసి పోరాడుతున్నారు.

- బొలిశెట్టి శ్రీనివాస్, జనసేన తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి

మరోసారి అవకాశమిస్తే..



రాష్ట్ర ప్రజలను జగన్ పీడిస్తున్నాడు. ఒక్క అవకాశం కోరితే ఇచ్చారు. మరోసారి ఇస్తే ఇక అంతే. ఇప్పటికే ఉత్తరాంధ్ర అనేక ప్రాంతాల నుంచి ప్రజలు వలస వెళ్లిపోయారు. మరోసారి అవకాశం ఇస్తే రాష్ట్ర ప్రజలే వలస వెళ్లే అవకాశం ఉంది. ఈ దారుణాలు ఎదుర్కోవడానికి పవన్, చంద్రబాబుతో కలిసి పోరాడతున్నారు.

- బొమ్మిడి నాయకర్, జనసేన నరసాపురం ఇన్‌చార్జి

సౌత్‌జోన్ క్రికెట్ పోటీలకు కేజీఆర్ఎల్ విద్యార్థి ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న కేజీఆర్ఎల్ యాజమాన్యం

భీమవరం అర్బన్, జనవరి 7: విద్యార్థులకు చదువు తోపాటు క్రీడలు కూడా ముఖ్యమని కేజీఆర్ఎల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మెంటే హరినాథ్‌బాబు అన్నారు. నరసాపురం వైఎన్ కాలేజీ గ్రౌండ్‌లో గతనెల 30న జరిగిన నన్నయ ఇంటర్ యూనివర్సిటీ పరిధిలో సౌత్‌జోన్ క్రికెట్ టీమ్ సెలక్షన్స్‌లో కేజీఆర్ఎల్ కాలేజీ విద్యార్థి జి.చరణ్‌సాయితేజ ఎంపికైన సందర్భంగా ఆదివారం అభినందించారు. విద్యార్థిని కేజీఆర్ఎల్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, కార్యదర్శి మెంటే రామ్మోహన్‌రావు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి పోటీల్లో అప్పనవీడు విద్యార్థులు జిల్లా ఫస్ట్



జిల్లా స్థాయిలో బహుమతి పొందిన విద్యార్థులు

పెదపాడు, జనవరి 7 : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏలూరు నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పెదపాడు మండలం అప్పనవీడు హైస్కూల్ విద్యార్థుల జట్టు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం సాధించిందని హెచ్‌ఎం తోట పుష్పావతి తెలిపారు. జట్టు సభ్యులైన రవికిరణ్ (10వ తరగతి), రాఘవేంద్ర (9వ), రూపిని (8వ)లను ప్రత్యేకంగా ఆదివారం అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయిని ఎం.అమరావతి, ఎ.విజయ, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ చింతా రమాదేవి పాల్గొన్నారు.

సమగ్రశిక్ష సీఎంవో పోస్టు భర్తీపై డైలమా

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 7 : సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంవో) పోస్టు భర్తీపై డైలమా నెలకొంది. ప్రాజెక్టు సెక్టోరల్ అధికారుల పోస్టుల్లో ఒకటైన సీఎంవో ఉద్యోగఖాళీని డిప్యూటేషన్‌పై భర్తీచేసేందుకు విద్యాశాఖ ఇటీవల దరఖాస్తులను ఆహ్వానించింది. మొత్తం ముగ్గురు దరఖాస్తుచేసుకోగా, వీరిలో ఒకరు 50ఏళ్లు పైబడి వయస్సు గల వారు కావడంతో నిబంధనల మేరకు అనర్హుడయ్యారు. మరొకరు స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచరు కావడంతో సీఎంవో పోస్టుకు అర్హత ఉండదని తేల్చారు. ఇక లింగపాలెం ఎంఈవో-2గా పనిచేస్తున్న గెజిటెడ్ అధికారి ఒకరు ఈ పోస్టుకి దరఖాస్తుచేయగా, ఆయనను సీఎంవోగా నియమించేందుకు తగిన అర్హతలుండటంతో మార్గం సుగుమమైంది. ఈ క్రమంలో ఆయన పేరును సీఎంవో పోస్టుకి సిఫారసుచేస్తూ ఫైలును కలెక్టర్ ఆమోదం నిమిత్తం పంపించనుండగా ఓ ఉపాధ్యాయ సంఘం అభ్యంతరం తెలిపింది. ఇప్పటికే ఎంఈవో-2పోస్టులో కొనసాగుతూనే ఇన్‌చార్జి సీఎంవోగా కూడా వ్యవహరిస్తున్న ఆ అధికారి నిబంధనల ప్రకారం రెగ్యులర్ సీఎంవో పోస్టులో నియమితుడుకావడానికి అనర్హుడవుతారని పేర్కొన్నారు.ఇదే విషయమై డీఈవో శ్యాంసుందర్‌ను వివరణ కోరగా 'సీఎంవో పోస్టుకి దరఖాస్తు చేసుకున్న ముగ్గురిలో ఒక్కరికి మాత్రమే అర్హతలున్నందున ఆయనను నియమిం చేందుకు ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించాలని నిర్ణయించాం. అయితే నియా మకాన్ని ఖరారు చేసేముందు ఎంఈవో-2 పోస్టును ఆయన వదులుకుంటేనే సీఎంవోగా నియమిస్తామని అంగీకారం తీసుకున్న తర్వాత మాత్రమే జరుగుతుంది 'అన్నారు.

వైభవంగా గోదాదేవికి సారె సమర్పణ

జంగారెడ్డిగూడెం, జనవరి 7:గోకుల తిరుమల పారిజాత గిరి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా 21వ రోజు గోదా అమ్మవారికి ఆలయంలో ఉన్న సమస్త దేవతామూర్తులకు చిన్న జీయర్‌స్వామి వారి ఆధ్యాత్మిక సేవా సంస్థ, జంగారెడ్డిగూడెం వికాస తరంగిణి ఆధ్వర్యంలో సారె సమర్పణ వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రములు, పలు రకాలైన పండ్లు, గాజులు, పసుపు, కుంకుమ నైవేద్యాలు సమర్పించారు. ప్రధానార్చకుడు నల్లూరు రవికుమార్‌ఆచార్యులు ఆధ్వర్యంలో గోదా అమ్మవారి ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించి సారెలో ఉపయోగించిన పండ్లు, ఫలములు, గాజులు, నైవేద్యాలను భక్తులకు అందజేశారు. వికాస తరంగిణి అధ్యక్షురాలు కొల్లూరి శ్యామల, రామ సత్య వీరవెంకట అప్పారావు మాస్టారు, మాడ గోపాలకృష్ణ, మోతుకూరి సత్యనారాయణ, కొనకల్ల చంద్రశేఖర్, హిమగిరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



పారిజాతగిరిలో గోదాదేవికి సారె సమర్పిస్తున్న భక్తులు



చిన్నతిరుపతిలో గోదాదేవి సమేతంగా శ్రీవారి దివ్యమూర్తులు

అట్టహాసంగా.. ధనుర్మాస ఉత్సవం

ద్వారకాతిరుమల, జనవరి7: శ్రీవారి క్షేత్రంలోని విలాస మండపంలో స్వామి, అమ్మవార్లకు ఆదివారం ఉదయం ధనుర్మాస ఉత్సవాన్ని అట్టహాసంగా జరిపారు. తొలుత స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవి అమ్మవార్లను ఆలయంలో తొళక్క వాహనంపై ఉంచి అలంకరించి, పూజలు చేశారు. ఆ తరువాత క్షేత్రపురవీథుల్లో మేళతాళాలు, డోలు సన్నాయి వాయిద్యాల నడుమ ఘనంగా ఊరేగించారు. అనంతరం ధనుర్మాస మండపంలో ప్రత్యేక పూజలు జరిపి హారతులిచ్చి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

క్రైం కార్నర్

ఎక్సైజ్ దాడులు.. ముగ్గురి అరెస్ట్

చింతలపూడి, జనవరి 7: మండలంలోని యర్రంపల్లి, నాగిరెడ్డిగూడెం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు ఆదివారం నాటుసారా బట్టీలపై దాడులు నిర్వహించారు. నలుగురిపై కేసులు నమోదు చేసి ముగ్గురిని అరెస్టు చేశారు. వారి నుంచి 15 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సాయిస్వరూప్, ఏలూరు డీటీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

12 మంది జూదరుల అరెస్ట్

పెదపాడు, జనవరి 7 : పెదపాడు మండలం కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లో పేకాట ఆడుతున్న 12 మందిని అరెస్ట్ చేశామని ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. ఆయా గ్రామాల్లో ఆదివారం పేకాటాడుతున్నట్టు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. వారి వద్ద నుంచి రూ.4,900 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా విక్రయిస్తున్న మహిళ అరెస్టు

ఏలూరు క్రైం, జనవరి 7 : సారా విక్రయిస్తున్న ఓ మహిళను అరెస్ట్ చేశామని రూరల్ హెడ్‌కానిస్టేబుల్ డీవీ రమణ తెలిపారు. ఓ మహిళ సారా విక్రయిస్తుందని ఏలూరు రూరల్ పోలీసులకు సమాచారం అందింది. సిబ్బందితో ఆదివారం సాయంత్రం ఏలూరు రూరల్ మండలం ప్రత్తికోళ్లలంక గ్రామానికి వెళ్లి తనిఖీలు చేశామన్నారు. సైదు మణి అనే మహిళ ఐదు లీటర్ల సారా కలిగి ఉంది. ఆమెను అరెస్టు చేసి సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కోడి పందేలపై దాడి.. ఇద్దరి అరెస్ట్

ముసునూరు, జనవరి 7: చింతలవల్లి పంచాయతీ పరిధిలోని కొత్తూరులో ఆదివారం కోడిపందేల శిబిరంపై దాడి చేసి ఇద్దరిని అరెస్ట్ చేశామని ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3500 నగదు, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ప్రజా నాయకుడు మోహన్ రంగా



మాట్లాడుతున్న వంగవీటి రాధాకృష్ణ

టి.నరసాపురం, జనవరి 7 : ప్రజా నాయకుడు వంగవీటి మోహన్ రంగా అని ఆయన తనయుడు మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ అన్నారు. తిరుమలదేవిపేట గ్రామంలో వంగవీటి యూత్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పా టు చేసిన రంగా విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంగవీటి మోహన్ రంగా అందరివా డని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షుడు జెట్టి గురునా ధరరావు, టీడీపీ నాయకులు పారేపల్లి రామారావు, డీకేడీ సత్యనారాయణ, పులి శ్రీరాములు పలువురు కాపు నాయకులు, రంగా అభిమానులు పాల్గొన్నారు.

నేడు ఆటోల సమ్మె

భీమవరంటౌన్, జనవరి 7 : ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల తమ ఉపాధి దెబ్బతీస్తోందని తెలంగాణ ఆటో సంఘాలు బంద్ పాటిస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా జిల్లాలోని ఆటో యూనియన్‌లు అన్ని సోమవారం సేవలు నిలిపివేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో కూడా రాజకీయ పార్టీలు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని హామీలు ఇవ్వడంతో ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే టీడీపీ ఈ హామీని ప్రచారం చేస్తోంది. త్వరలో అధికార పార్టీ కూడా ఒక నిర్ణయాన్ని తీసుకుని ఎన్నికలకు ముందుగా ఉచిత ప్రయాణం ఇస్తారని ఇప్పటికే పత్రికల్లో కథనాలు వస్తున్న నేపథ్యంలో ఆటో యూనియన్‌లు వీటికి అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి. ఆటో యూనియన్ అధ్యక్షుడు చైతన్య మాట్లాడుతూ ప్రభుత్వాలు మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం ప్రవేశపెట్టడం వల్ల ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతారన్నారు. తెలంగాణలో పరిస్థితి తమకు రాకూడదనే ముందుగానే నిరసన తెలుపుతున్నామన్నారు.

రేపటినుంచి సంక్రాంతి సెలవులు

ఏలూరు ఎడ్యుకేషన్, జనవరి 7 :పాఠశాలలకు ఈనెల 9 నుంచి 18వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. సెలవుల అనంతరం 19వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయని ఏలూరు జిల్లా డీఈవో పి.శ్యాంసుందర్ తెలిపారు. సెలవులు అన్ని ప్రైవేటు పాఠశాలలకు కూడా వర్తిస్తాయని, ఎక్కడైనా పాఠశాలలు తెరిచి తరగతులు నిర్వహిస్తే చట్టప్రకా రం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికంగా వున్న విద్యాశాఖ తనిఖీ అధికారులు తమ పరిధిలోని ప్రైవేటు స్కూళ్లపై పర్యవేక్షణ ఉంచాలని సూచించారు.

హరికథకు ఆదరణ తగ్గదు

- అన్నమాచార్య ప్రాజెక్టు హరికథ కళాకారిణి కృష్ణకుమారి



కళాకారిణి కృష్ణకుమారిని సత్కరిస్తున్న కళాకారులు

భీమవరంటౌన్, జనవరి 7 : ఆధ్యాత్మిక మానసిక ప్రశాంత తకు హరికథ దోహదపడు తుందని, ఎప్పటికీ హరికథకు ఆదరణ తగ్గదని టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆస్థాన హరికథ కళాకారిణి జంధ్యాల కృష్ణకుమారి అన్నారు. స్థానిక త్యాగరాజ భవనంలో జరుగుతున్న 105వ త్యాగరాజ ఆరాధనోత్సవాలకు వచ్చిన ఆమెను ఆదివారం సత్కరించారు. ఆమె మాట్లాడుతూ హరికథలో అన్నమాచార్య చరిత్ర, వెంకటేశ్వర వైభవంపై శిక్షణ తీసుకున్నానని, తరువాత 1983నుంచి ఆస్థాన హరికథ కళాకారిణిగా స్వామివారికి సంకీర్తన సేవా చేసే భాగ్యం కలిగిందని అన్నారు. 18 ఏళ్లపాటు నిర్విరామంగా హరికథ కళాకారిణిగా చేస్తున్నానని, హరికథకు ప్రతిచోట విశేష ఆదరణ లభిస్తుందన్నారు. తన చిన్నతనం నుంచే హరికథపై మక్కువతో ఇంట్లో ప్రోత్సహించి నేర్పించారన్నారు. హరికథను 105 ఏళ్లుగా త్యాగరాజ ఆరాధోత్సవాలలో నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ వైభవ మహోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు.

జడ్పీ మంజూరు చేసిన పనులు సత్వరమే పూర్తి చేయాలి : జడ్పీ చైర్‌పర్సన్



మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ

ఏలూరు కలెక్టరేట్, జనవరి 7: జడ్పీనుంచి మంజూరు చేసిన పనులను వెంటనే పూర్తిచేయాలని మొదలు కాని పనులను సత్వరమే ప్రారంభించి పనులు చేపట్టాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ఆదేశించారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని జడ్పీ నిధులతో చేపట్టిన పనులపై ఆదివారం పంచాయతీరాజ్, గ్రామీణనీటి సరఫరా విభాగం శాఖల ఈఈలు, డీఈలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 ఏడాదికి గాను ఎన్ఆర్ఈజీఎస్, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టాల్సిన 604 రకాల పనులతో ప్రజలకు ఉపయోగపడే పనులను గుర్తించి పంచాయతీ రాజ్ మూడెంచెల వ్యవస్థలలో ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. జడ్పీ సీఈవో కె.ఎస్.ఎస్ సుబ్బారావు, ఎంపీవీ సత్యనారాయణ, రామస్వామి, రమాకాంతరావు, రమణమూర్తి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ఏలూరు కల్చరల్, జనవరి 7: ఏలూరులోని ఏఆర్‌డీజీకే హైస్కూల్లో 1989-90లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఆత్మీయ పలకరింపులు, నాటి మధురస్మృతులను గుర్తుచేసుకుని సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఎస్.గీత, లలితకుమారి, స్వర్ణలత, రాజ్‌కుమార్, ప్రకాశ్, అబ్దుల్లా, కొండలరావు తదితరులు పాల్గొన్నారు.



1989-90లో టెన్త్ చదివిన విద్యార్థులు